క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ప్రాంగణంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంకకు చెందిన కట్టా లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సోమవారం రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. విరాళం అందించిన దాత కుటుంబానికి ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

నేడు రావులమ్మ తీర్థం

అంబాజీపేట: గంగలకుర్రులో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతరను కనులపండువగా నిర్వహించారు. గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలు అమ్మవారి పూజా ఘటాలను పురవీధుల్లో ఊరేగించుకున్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

మలికిపురం: మండలంలోని లక్కవరానికి చెందిన గుబ్బల గోకనేశ్వరరావు మూడు నెలలుగా మెడ నరాల సమస్యతో మంచానికి పరిమితమయ్యాడు. ఆపరేషన్ నిమిత్తం రెండు లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో వాట్సాప్ గ్రూపులను ఆశ్రయించారు. వెంటనే గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి గ్రూపు ముందుకు వచ్చి రూ.20 వేలు సమకూర్చింది. అలాగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బొంతు రాజు రూ.2 వేలు అందజేశారు. మొత్తం రూ.22 వేలను పాల్గొన్న గ్రూప్ సభ్యులు బాధితుడికి అందజేశారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

రావులపాలెం: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్ఆర్‌జీఈఎస్ పథకం కింద ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సోమవరం ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎన్ఆర్‌జీఈఎస్, వైద్యారోగ్యశాఖ అధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పనుల చేస్తున్న ప్రదేశాలకు ఆరోగ్య సిబ్బంది వెళ్లి ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ఈఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నట్లు ఏపీఓ ప్రసాద్ తెలిపారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో అక్రమంగా సారా తయారు చేస్తున్న స్థావరంపై సోమవారం ఆలమూరు పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కథనం ప్రకారం గ్రామ శివార్లలోని శ్మశానవాటిక సమీపాన సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎస్సై శ్రీనునాయక్ నేతృత్వంలోని పోలీసుల బృందం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో అప్పటికే తయారు చేసిన సుమారు 100 లీటర్ల సారా, 300 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. ఆ ప్రదేశంలో ఉన్న బైక్‌ను, వంట పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న కె.వీరన్నను అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు సూర్యనారాయణమూర్తి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిపారు. సామూహిక అక్షరాభ్యాసాల్లో సుమారుగా 50 మంది చిన్నారులు పాల్గొన్నారు. అలాగే పలువురు చిన్నారులకు నామకరణ, అన్నప్రాశనలు నిర్వహించారు. స్వామికి తులాభారాలు, మొక్కులు చెల్లించారు.

అగ్నిమాపక వారోత్సవం

రాజోలు: స్థానిక బస్టాండ్‌లో సోమవారం అగ్నిమాపకాధికారి బి.బాలకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది అగ్నిమాపక వారోత్సవంలో భాగంగా ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. అగ్నిప్రమాదాలపై, వాటి నివారణ, ఫైర్ ఇంజిన్ల ప్రాధాన్యతలపై వివరించారు.

పిల్లలకు పుస్తకాల పంపిణీ

రాజోలు: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని సోమవారం కడలి గ్రామంలో సిద్ధార్థ యూత్ ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామంలోని సుమారు 70 మంది పిల్లలకు పుస్తకాలతో పాటు విద్యకు సంబంధించిన కిట్లు ఇచ్చారు.

ఉచిత విత్తనాలు అందించాలి

మామిడికుదురు: రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు అందించే 30 రకాల సేంద్రియ, కూరగాయల విత్తనాలను ఉచితంగా లేదా రాయితీతో అందించాలని నారియల్ భారత్ న్యూట్రా ప్రొడ్యూసర్ కంపెనీ సమావేశం కోరింది. కంపెనీ ఎండీ, సీనియర్ సైంటిస్ట్ నయినాల వేణుగోపాల్ అధ్యక్షతన మామిడికుదురులో సోమవారం జరిగిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు. కొబ్బరి కూడా ఒక పంట కావడంతో పంట కాలువల ద్వారా వేసవి కాలంలో రెండు నీటి తడులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరింది. సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

జోష్ నింపిన మిథున్‌రెడ్డి పర్యటన

- నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా భేటీ
- రాజోలు నియోజకవర్గంలో పార్టీ విజయంపై దిశా నిర్దేశం
- టీడీపీ, జనసేన నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం నేతలకు కండువాలు వేసిన ఎంపీ మిథున్‌రెడ్డి



పార్టీలో చేరిన జనసేన నాయకులకు కండువాలు వేసిన ఎంపీ మిథున్‌రెడ్డి

మలికిపురం: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డి సోమవారం నియోజకవర్గంలో పర్యటన పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో జోష్ నింపింది. మలికిపురంలోని పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు నివాసం వద్ద ఆయన అధ్యక్షతన పార్టీ, నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో పాల్గొన్న మిథున్ రెడ్డి పార్టీ కార్యకర్తలకు నియోజక వర్గంలో పార్టీ విజయంపై దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పార్టీ శ్రేణులను చక్కని సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీని నడుపుతున్న తీరును ఎంపీ అభినందించారు. ఇదే విధానంతో ముందుకు సాగితే పార్టీ విజయం సాధించడం కష్టమేమీ కాదని మిథున్ రెడ్డి అన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, పార్టీ అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతిపక్షాలు కూటమి పేరుతో రాష్ట్రంలో కుట్రలు చేస్తూ వైఎస్సార్ సీపీని అప్రతిష్ట పాలు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను పార్టీ నాయకులు, అనుబంధ సంస్థలు ప్రతిఘటించాలని సూచించారు. పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం పార్టీ నాయకుడు కెఎస్ఎన్ రాజు ఇంట్లో నియోజకవర్గంలోని మండల కమిటీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. మిథున్‌రెడ్డితో భేటీ అనంతరం ఆయా నాయకులు కార్యకర్తలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.

జనసేన నుంచి పలువురి చేరిక

ఎంపీ మిథున్ రెడ్డి సమక్షంలో జనసేన నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ నాయకుడు కెఎస్ఎన్ రాజు ఇంటి వద్ద ముస్లిం పెద్ద మహ్మద్ జియా ఉద్దీన్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే పార్టీ నాయకులు జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద ఆయన ఆధ్వర్యంలో చింతలమోరి మాజీ సర్పంచ్ కారుపల్లి విజయ్‌మోహన్, రాజోలు మండలానికి చెందిన గుబ్బల చిన్నా, కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన యెనుముల ఏసు పార్టీలో చేశారు. వారందరికీ మిథున్‌రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, మండల పార్టీ అధ్యక్షులు అడబాల వీర బ్రహ్మాజీరావు, నల్లి డేవిడ్, కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్, జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, మట్టా శైలజ, దొండపాటి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఉష్ణోగ్రతల నుంచి కాపాడేందుకు అప్రమత్తం

కొత్తపేట: ప్రజలను వేసవి ఉష్ణోగ్రతల నుంచి కాపాడేందుకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ) డాక్టర్ ఎం.దుర్గారావుదొర సంబంధిత శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలనే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంపీపీ కార్యాలయం ప్రాంగణంలో స్వీప్ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగుల అవగాహన శిబిరంలో స్వీప్ నోడల్ సభ్యుడిగా డీఎంఅండ్‌హెచ్‌ఓ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతున్న తరుణంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎవరు అస్వస్థతకు గురయినా వెంటనే తగు ప్రాథమిక చికిత్స అనంతరం, సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫారసు చేయాలన్నారు. వృద్ధులు, పిల్లలు, అనారోగ్య బాధితులు ఉద యం 11 నుంచి సాయంత్రం 4 వరకూ బయటకు వెళ్లరాదన్నారు. ఇంటి వద్ద ఉష్ణతాపం తగలకుండా చల్లటి కర్టెన్స్ రక్షణలో ఉండాలన్నారు. ఆయన వెంట వానపల్లి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వి.రాధాకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ప్రజల దీవెనలే జగన్‌కు శ్రీరామరక్ష



అప్పనపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు

మామిడికుదురు: ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల దీవెనలే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీరామ రక్ష అని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. ఆయన సోమవారం అప్పనపల్లి, పాశర్లపూడిలంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చైతన్యరథంపై నిల్చుని ప్రజలకు అభివాదం చేస్తూ జననేత జగన్‌కు మీ ఆశీర్వాదాలు అందించాలని కోరారు. వైఎస్సార్ సీపీ సర్కారు అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. జగన్ సారథ్యంలోనే ఇంటింటికీ వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తారని చెప్పారు. పొరపాటున వేరే పార్టీకి ఓటు వేస్తే అయిదేళ్ల తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. జన్మభూమి కమిటీలు కావాలో, వలంటీర్లు కావాల్లో ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని విప్పర్తి సూచించారు. పాలన చూడండి, మంచి చేశామంటేనే ఓట్లు వేయండి అని అడిగే దమ్ము, ధైర్యం ఒక్క జగన్‌కే ఉందన్నారు. విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీకి అండగా నిలివాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, పార్టీ నేతలు గెద్దం మంగా లక్ష్మి, బొంతు నీలిమ, గెద్దం కృష్ణమూర్తి, నేరేడుమిల్లి జనార్దనరావు, బాలం రమేష్, ముత్యాల నర్సింహారావు, బొరుసు నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పంచముఖ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో శ్రీపంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక ఏటిగట్టు సమీపంలో గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఈపంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, కుటుంబసభ్యుల సమేతంగా పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకుని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. గ్రామంలో అనునిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామంలో భక్తిభావం పెంపొదిస్తున్న గ్రామస్తులను ఆయన అభినందించారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు తోట శ్రీనివాసు, తోట సతీష్, ఉండమట్ల భీమశంకర్ పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే దాడి



రాజోలు సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: సిద్ధం బస్సు యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షం చూసి ఓర్వలేకనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడికి తెగపడిందని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం రాజోలులో ఆ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. సమావేశంలో గొల్లపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతిపక్ష కూటమి కలిసి పనిచేసినా కూడా సీఎం జగన్‌ను ఏమీ చేయలేరని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ముఖ్యమంత్రి పీఠాన్ని తిరిగి అధిష్టించేది జగన్ మోహన్‌రెడ్డేనని అన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు కొప్పాడి దుర్గారావు, పార్టీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాస్, సర్పంచ్ రేవు జ్యోతి, పార్టీ శ్రేణులు దార్ల పెదబాబు, బందారు కాశీ, మట్టా ఏడుకొండలు, చెల్లింగి లక్ష్మిఈశ్వరి, కొపనాతి పుష్పలత, మట్టా కృష్ణమూర్తి, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

పెత్తందార్లకు.. పేదలకు మధ్య పోరాటం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గిరెడ్డి



ఖండ్రిగలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రస్తుత ఎన్నికల్లో పెత్తందార్లకు.. పేద వర్గాలకు మధ్య పోరాటం జరుగుతుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి సమాయత్తంలో భాగంగా సోమవారం సాయంత్రం అవిడి, ఖండ్రిగ, పలివెల గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి పేద, బడుగు, బలహీన వర్గాలు ఆర్థిక బలోపేతం లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజలకు చేరువలో పరిపాలన తీసుకువచ్చే క్రమంలో గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను తీసుకువస్తే టీడీపీ నేతలు ఆక్రోశం వెళ్లగక్కారన్నారు. పేదలు విద్యావంతులు కావడం, పథకాలు పొందడం వాళ్లకు ఇష్టం ఉండదని, ఎప్పుడూ ధనవంతులే ఇంకా ధనవంతులుగా పేదలపై పెత్తందార్లు కావాలనేదే వారి దుర్బుద్ధి అని విమర్శించారు. స్థానిక సంస్థల పదవులతో పాటు, నామినేటెడ్ పదవులు, మంత్రి పదవుల్లో బీసీలకు ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాలో ప్రధానమైన శెట్టిబలిజ కులాలకు ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిలో పదవులు కట్టబెట్టి అరుదైన గౌరవం కల్పించిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు, అర్హత ఒక్క వైఎస్సార్ సీపీ కార్యకర్తకే ఉందన్నారు. సమావేశాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, అవిడి సర్పంచ్‌లు రెడ్డి చంటి, దూనబోయిన నవదీప, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు ముసునూరి వెంకటేశ్వరరావు, నామాడి రాజారత్నం, ఎంపీటీసీ సభ్యులు పితాని లక్ష్మీతులసి, దూళి సూరిబాబు, నేతల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశాల పునః ప్రతిష్ఠ

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామివారి ఆలయ ఉత్తర రాజగోపురంపై కలశాల పునః ప్రతిష్ఠను సోమవారం అర్చకులు, వేదపండితులు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. ఈ మేరకు ఏసీ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు, వైదిక సిబ్బంది గత రెండు రోజులుగా పూజలు చేశారు. అర్చకులు, వేదపండితులు సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం చివరి రోజున ఉదయం 8.25కు కలశాల పునః ప్రతిష్ఠ, తదనంతరం 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, సూపరింటెండెంట్ పి.విజయసారథి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



కొత్తపేటలో వృద్ధులు, దివ్యాంగులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో, ఆర్ఓ సత్యనారాయణ

కొత్తపేట: ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక ఆర్డీవో, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీవీ సత్యనారాయణ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నియోజకవర్గ పరిధిలోని వృద్ధులు, దివ్యాంగులకు ఓటు వినియోగించుకోవడంపై మెగా అవగాహన శిబిరం నిర్వహించారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉద్యాన అధికారి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి ఎన్వీ రమణ అధ్యక్షతన జరిగిన శిబిరంలో ఆర్డీఓ, ఆర్ఓ సత్యనారాయణ మాట్లాడుతూ నూరు శాతం ఓటింగ్ లక్ష్యంగా ఓటర్లను చైతన్యపర్చడంలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధులమని, దివ్యాంగులమని, నా ఓటు వేయడానికి శ్రమపడి పోలింగ్ స్టేషన్‌కు వెళ్లాలా.. ఓటు వేయాలా.. అనుకోకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర, తహసీల్దార్ ఎలీషా, ఎంపీడీఓ కె.వాణి, ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్‌ఓలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. ఇంటి నుంచి బయటకు రాలేని వయోవృద్ధులు, దివ్యాంగులు ఓటు ఫ్రం హోం (ఇంటి నుంచే ఓటు వినియోగించుకునే అవకాశం) కల్పిస్తున్నట్టు తెలిపారు. 85 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులు, 40 శాతం పైబడిన అంగవైకల్యం కలిగిన దివ్యాంగులు ఓటు ఫ్రం హోంకు అర్హులన్నారు. ఇందుకు ఫారం 12 డీ పూర్తి చేసి, సంబంధిత ధ్రువీకరణ పత్రం జత చేసి సంబంధిత ఎన్నికల అధికారికి సమర్పించాలన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటింగ్ విధులు నిర్వర్తించే సిబ్బందికి సోమవారం మధ్యాహ్నం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆర్డీఓ, అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు, ఏఆర్‌ఓలు పోలింగ్ అంశాల, ఈవీఎంల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ వీరాస్వామి నాయుడు

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి

మలికిపురం: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు సూచించారు. సోమవారం మలికిపురం మండల సమాఖ్య కార్యాలయంలో నీ ఓటు నీ భవిష్యత్తు అనే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ పాల్గొని మాట్లాడుతూ అర్హులైన వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ఓటు వున్న వారందరూ తప్పనిసరిగా తమ ఓటింగ్‌లో పాల్గొనాలని, ప్రలోభాలకు దూరంగా ఉండి నచ్చిన వారికి ఓటు వేయాలని, ఎవరికీ వేయడానికి ఇష్టపడని వారు 'నోటా'కు ఓటు వేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం డి.వరాలబాబు, సీసీ నాగరాజు, అకౌంటెంట్ జోగారావు ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.

కొత్తపేట చేరిన ఎంపీ ఈవీఎం యూనిట్లు

కొత్తపేట: అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ స్టేషన్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) యూనిట్లు కొత్తపేట చేరాయి. ముమ్మిడివరం నుంచి ఆదివారం రాత్రి భద్రతా సిబ్బంతో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు తరలించారు. ఆ పాఠశాలలో సిద్ధం చేసిన ప్రత్యేక రూములో వాటిని భద్రపరిచారు. నియోజకవర్గంలో 262 పోలింగ్ స్టేషన్లు కాగా 314 చొప్పున బ్యాలెట్ యూనిట్స్, కంట్రోలింగ్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ చేరగా వాటిని ఆర్డీవో సత్యనారాయణ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రూంలో భద్రపరిచి సీల్ వేశారు. ఇంకా అసెంబ్లీ నియోజకవర్గం ఈవీఎం యూనిట్స్ రావాల్సి ఉందని ఆర్‌డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎలీషా, ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, వీఆర్‌ఓలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు గ్రామాలు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా నర్శిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు తదితర గ్రామాలకు సంబంధించి ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. వినియోగదారులందరూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌కో ఏఈ వై.లక్ష్మి, లైన్ ఇన్‌స్పెక్టర్లు వాసంశెట్టి సత్యనారాయణ, కేవీవీ సుబ్రహ్మణ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మూడు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. పాశర్లపూడిబాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. జాతీయ రహదారుల విభాగం రహదారి విస్తరణ పనులతో పాటు నగరం విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డిగ్రీ విద్యార్థిని 'సత్యవాణి'కి 'జాతీయ రత్న' పురస్కారం



విశాఖపట్నంలో సత్యవాణిని సత్కరిస్తున్న విశాఖరత్న కళాపరిషత్ సభ్యులు, ప్రముఖులు

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని, కూచిపూడి, భరతనాట్యం కళాకారిణి కె.బేబీ సత్యవాణి విశాఖ రత్న కళాపరిషత్ వారి జాతీయ రత్న ఉగాది పురస్కారం అందుకుంది. స్థానిక కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న సత్యవాణి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కూచిపూడి, భరతనాట్యానికి సంబంధించి అనేక ప్రదర్శనలు ఇచ్చింది. ఆమె ప్రతిభను గుర్తించి దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అనుబంధ సంస్థ విశాఖరత్న కళాపరిషత్ వారు ఈ నెల 11న విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు సందర్భంగా విశాఖ ప్రముఖుల చేతుల మీదుగా బేబీ సత్యవాణిని 'జాతీయరత్న' ఉగాది పురస్కారంతో సత్కరించారు. సోమవారం సాయంత్రం కళాశాలలో సత్యవాణిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానోత్సవం



కబడ్డీలో మొదటి బహుమతి పొందిన జట్టుకు షీల్డ్ ఇస్తున్న సర్పంచ్ చిట్టిబాబు, స్పాన్సర్ చింటు

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక మూడు తూములు సెంటర్లో శనివారం, ఆదివారం రెండు రోజుల్లో కబడ్డీ పోటీలను అంబేడ్కర్ యూత్ సొసైటీ నిర్వహించింది. ఆదివారం రాత్రి విజేతలకు బహుమతులను అందజేశారు. యూత్ సొసైటీ 42వ వార్షిక దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను ఏర్పాటు చేశారు. పోటీల్లోని విజేతలకు స్పాన్సర్‌లు సమకూర్చిన నగదు, షీల్డ్‌లను అందజేశారు. మొదటి బహుమతి గెలుచుకున్న గన్నవరం జట్టుకు నగదు రూ.15 వేలు, షీల్డ్, అలాగే రెండో బహుమతి గెలుచుకున్న సఖినేటిపల్లి పాపం పసివాళ్లు జట్టుకు నగదు రూ.10 వేలు, షీల్డ్, మూడో బహుమతి గెలుచుకున్న రాజోలు జట్టుకు నగదు రూ.5 వేలు అందజేశారు. వీటితో పాటు బెస్ట్ రైడర్ బహుమతి గెలుచుకున్న సఖినేటిపల్లి రత్నాలపేటకు చెందిన సుబ్బుకు నగదు రూ.3 వేలు ఇచ్చారు. కాగా టోర్నమెంట్‌లో మొత్తం మెమెంటోలు, షీల్డ్‌లను కుసుమ చరణ్, సుశీల్, మున్నా స్పాన్సర్ చేశారు. యూత్ సొసైటీ ప్రెసిడెంట్ కె.బోని, వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీకర్, సెక్రటరీ కె.జాన్ మేజర్, జాయింట్ సెక్రటరీ ఐ.కోమల్, ట్రెజరర్ ఎం.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు సముచిత స్థానం కల్పిస్తాం



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి వేణుగోపాలరావు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శెట్టిబలిజ వర్గీయులకు పదవుల కేటాయింపులో సముచిత స్థానం కల్పించిన విధంగానే పి.గన్నవరం నియోజకవర్గంలో కూడా ప్రాధాన్యం ఇస్తామని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు హామీ ఇచ్చారు. శెట్టిబలిజ సంఘీయులతో సోమవారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. అందరి సూచనలు, సలహాలతో నామినేటెడ్ పోస్టుల భర్తీలో శెట్టిబలిజలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. పి.గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మాత్రమే శెట్టిబలిజలకు ఎంతో ప్రాధాన్యం కల్పించిందన్నారు. శెట్టిబలిజ వర్గీయులంతా కలసి వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్, నాయకులు మామిడిశెట్టి రాధామనోహర్, మట్టపర్తి శివ, జోగి రామకృష్ణ, చిట్టూరి రామకృష్ణ, దొమ్మేటి వెంకటశివరామన్, పితాని నర్సింహారావు, వాసంశెట్టి రామకృష్ణ, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, యాండ్ర వీరబాబు, పాల్గొన్నారు.

సీతారాముల ఆలయ ప్రారంభోత్సవం

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంకలోని సుందరవారి మెరకలో సోమవారం పునర్నిర్మాణం పూర్తి చేసుకున్న సీతారాముల ఆలయాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పండితుడు మంగళంపల్లి బులిబాబు ఆధ్వర్యాన ఆలయ పునర్నిర్మాణ దాత, గ్రామానికి చెందిన హైదరాబాద్ సాయినాథ్ ఫార్మాసిటికల్ కంపెనీ అధినేత సుందర పుల్లయ్యనాయుడు, అంజనీదేవి దంపతులు ఈ మేరకు స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాముని కల్యాణాన్ని భక్తుల మధ్య కనులపండువగా చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ రూ.30 లక్షలతో రామాలయాన్ని పునర్నిర్మించిన దాత నాయుడును సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు బల్రే శ్రీను, బత్తుల రవి అభినందించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు.